ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఫిబ్రవరి 2024



పాపం గిరి శిఖర గిరిజనులు. రోజంతా కష్టపడటమే వారికి తెలుసు. శరీరం సహకరిస్తే పనిచేసుకుంటారు. సుస్తీ చేస్తే ఇళ్ల వద్దే సొంత వైద్యం పాటిస్తారు. పరిస్థితి విషమించేవరకు డాక్టర్ గురించి ఆలోచించరు. కారణం వెళ్లాలంటే వాహనం లేదు.. అసలు రోడ్డే లేదు. దీంతో పరిస్థితి ఆందోళనకరంగా మారేవరకూ వైద్యం కోసం ఆలోచించరు. లేవలేని పరిస్థితి వచ్చేటప్పుడు కుటుంబ సభ్యులు, స్థానికులు డోలీ కట్టి కిలోమీటర్ల దూరం కాలినడకన తీసుకువెళ్తున్నారు. ఈ క్రమంలో మధ్యదారిలో తనువు చాలించిన ఘటనలు కోకొల్లలు. శృంగవరపుకోట మండలంలోని గిరిశిఖర పల్లెల్లో దుస్థితి ఇది. ఆదిమ కాలం నాటి దురావస్థలే అక్కడ నేటికీ కనిపిస్తున్నాయి.

ఇంకెంతమంది చావాలి



- గిరి శిఖర గ్రామాల్లో ఆదిమకాలం నాటి పరిస్థితులు
- అధ్వానంగా రోడ్లు ● రాళ్లు, పొదల్లో నుంచి నడవాల్సిందే
- సుస్తీ చేస్తే డోలీయే గతి.. ఆలస్యమైతే ప్రాణాలు హరీ
- డోలీ మోతపై ఇటీవల హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- చిట్టింపాడు చిన్నారి మృతిపై ప్రజా ప్రయోజన వాజ్యం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 3: కొండ శిఖర గిరిజన ప్రాంతాలకు రోడ్డు సదుపాయం లేక విద్య, వైద్యంతో పాటు పౌష్టికాహారానికి దూరంగా గిరిజనులు బతుకుతున్నారు. ప్రధానంగా ఆరోగ్య భరోసా లేదు. అనారోగ్యం బారిన పడితే దేవుడిపై భారం వేస్తున్నారు. డోలీయే గతి అవుతోంది. ఒక్కోసారి రోగిని తరలించే క్రమంలో మధ్యదారిలో ప్రాణం విడుస్తున్నారు. దీనికి తోడు ఆసుపత్రుల్లో వైద్యులు కూడా చిన్నచూపు చూస్తున్నారు. అక్కడి వెళ్తే ఎవరూ బాధ్యతగా వైద్యం అందివ్వరని గిరిజనులు వాపోతున్నారు. ఎంతో శ్రమించి ఆస్పత్రికి తరలించాక కూడా మృతి చెందిన వారెందరో. ఇటీవల ఎస్.కోట మండలం మూలబొడ్డవర పంచాయతీ శివారు చిట్టంపాడు గిరిజన గ్రామానికి చెందిన ఓ చిన్నారిని డోలీపై కొండకిందకు దించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్నారి మృతదేహాన్ని ఇంటికి పంపించేందుకు కేజీహెచ్ వైద్యులు అంబులెన్స్ ఇవ్వలేదు. దీంతో చిన్నారి మృతదేహాన్ని గ్రామం వరకు ఎత్తుకొని తీసుకొచ్చారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో జరిగిన రా..కదలిరా సభలో ఘాటుగా స్పందించారు. ఈ ప్రభుత్వం గిరిజన ప్రాంతాలకు చేస్తున్న అన్యాయాన్ని ఎత్తిచూపారు. టీడీపీ ప్రభుత్వం కొండ శిఖర ప్రాంతాలకు వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్‌లతో పాటు ఫీడర్ అంబులెన్స్ లను సమకూర్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాగా సకాలంలో వైద్యం అందక గిరిజనుల మృతి చెందుతున్నట్లు పత్రికల్లో వచ్చిన కథనాలతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలైంది. విచారణ సందర్భంగా రోడ్ల నిర్మాణం అవసరాన్ని హైకోర్టు ప్రస్తావించింది. గిరిజన ప్రాంతాలకు రోడ్లు లేకుండా సమస్యలను పరిష్కరించడం కష్టమని అభిప్రాయపడింది.

- శృంగవరపుకోట మండలం దారపర్తి, మూల బొడ్డవర పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు రోడ్ల లేవు. గంట్యాడ మండలం డీకే పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాలకు కూడా రోడ్లు కనిపించవు. వీరికి ఏది అవసరమైనా నదులు, గెడ్డలు, కొండలు, గుట్టలు దాటుకొని కాలినడకన రావాల్సిందే. అస్వస్థతకు గురైన గిరిజనులను కిందకు దించేందుకు డోలీ మోతొక్కటే మార్గం.
- పదేళ్ల పాటు గిరిజనులు చేసిన పోరాటం ఫలితంగా మూల బొడ్డవర పంచాయతీ శివారు దబ్బగుంట నుంచి దారపర్తి పంచాయతీ శివారు పల్లపు దుంగాడ వరకు ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద సుమారు 6 కిలోమీటర్ల పరిధిలో సుమారు రూ.4.80 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టడంతో నాలుగు గ్రామాలకు డోలీ మోత బాధ తప్పింది. ఇటీవల చిన్నారి మృతితో బొడ్డవర నుంచి చిట్టంపాడు వరకు రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ నాగలక్ష్మి జన్‌మన్‌యోజన కింద 10.4కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.11కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ప్రకటించారు.
- రోడ్లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో పనిచేసే ఉపాధ్యాయులు సక్రమంగా రావడం లేదంటున్నారు. దీంతో పల్లపు దుంగాడ, గూనపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లేందుకు గిరిజన పిల్లలు కూడా ఆసక్తి చూపడం లేదు.



- 'వైద్యం కోసం డోలీ ద్వారా తరలించడం ఆదిమకాలం నాటి పరిస్థితులను తలపిస్తున్నాయి. వైద్య సేవలు అందక గిరిజనులు మృతి చెందుతున్నారు. గిరిజన ప్రాంతాలకు రోడ్లు నిర్మించకుండా ఈ సమస్యకు పరిష్కారం చూపడం కష్టం. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రోడ్లు నిర్మించవచ్చు.'

  - ఇటీవల గిరిజన చిన్నారి మృతిపై దాఖలైన ప్రజా ప్రయోజన వాజ్యం విచారణ సందర్భంగా హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్య



తన ముగ్గురు పిల్లలతో పాటు బంధువుల చిన్నారితో కలిసి ఉన్న ఈ యువతి పేరు బడ్నాయన అచ్చమ్మ. వీరికి పోడు వ్యవసాయమే జీవనాధారం. ఎకరా పొలంలో పండిన పంట, అటవీ ప్రాంతంలో సేకరించిన చింతపండు వంటి ఉత్పత్తులను విక్రయించాలంటే 8 కిలోమీటర్ల దూరంలో వున్న రైల్వే స్టేషన్‌కు కాలినడకన రావాల్సిందే. వీరిలో ఎవరికైనా సుస్తీ చేస్తే డోలీ కట్టాల్సిందే. ఇలాంటి చోట విద్య, వైద్యం, పౌష్టికాహారం ఎంతవరకు అందుతాయో వీరిని చూసి అర్థం చేసుకోవచ్చు.

నాన్ షెడ్యూల్ ప్రాంతాలకు నష్టం

ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పటి నుంచి ఎస్.కోట, వేపాడ, జామి, కొత్తవలస, గంట్యాడ, మెంటాడ, బొబ్బిలి, నెల్లిమర్ల తదితర మండలాల పరిధిలోని 74 గిరిజన గ్రామాలు నాన్ షెడ్యూల్‌గా వున్నాయి. షెడ్యూల్ ప్రాంతాల్లో వున్న గిరిజన సంస్కృతిని వీరు కలిగి వున్నప్పటికీ ప్రభుత్వం కనికరించడం లేదు. దీంతో షెడ్యూల్ ప్రాంతాల్లో నివశిస్తున్న గిరిజనులకు అందుతున్న ఫలాలు నాన్ షెడ్యూల్ ప్రాంతంలో వున్న గిరిజనులకు అందడం లేదు.

ఐటీడీఏ పరిధిలో చేర్చాలి

ఐటీడీఏలో చేరినప్పుడే నాన్ షెడ్యూల్ నుంచి షెడ్యూల్ పరిధిలోకి వెళతాం. అప్పుడే గిరిజనుల కష్టాలు తొలుగుతాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో వున్న అనంతగిరి మండలానికి ఆనుకుని ఎస్.కోట, గంట్యాడ, వేపాడ గిరిజన గ్రామాలు వున్నాయి. వీటన్నింటినీ ఐటీడీఏలో చేర్చితే మంచిది. మిగిలిన గిరిజన గ్రామాలను పార్వతీపురం ఐటీడీఏలో చేర్చాలి.

- జె.గౌరీష్, అదివాసి గిరిజన సంఘనాయకుడు

బాగోగులు తెలుసుకోవడానికే వచ్చా

టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి భరత్

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 3 : 'నేను మిమ్మల్ని ఓటు అడిగేందుకు రాలేదు. మీరంతా ఎలా ఉన్నారో తెలుసుకోవాలని, చనిపోయిన ముగ్గురు గిరిజనుల కుటుంబాలను కలవాలని వచ్చాను. మీ సమస్యలు తీరుస్తానని నేను చెప్పలేను.. ఎందుకంటే ఈ గ్రామాలకు రోడ్లు వేయాలంటే వెంటనే జరిగే పనికాదు.. మా పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే మాత్రం రోడ్లు వేయించేందుకు నా వంతు కృషిచేస్తాను' అంటూ మండలంలోని గిరిశిఖర గ్రామమైన బొడ్డవర పంచాయతీ చిట్టంపాడు గిరివాసులతో టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఇన్‌చార్జి శ్రీభరత్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో పాటు మైదాన ప్రాంతం నుంచి ఏడుకిలోమీటర్లు దూరంలో వున్న గ్రామానికి శనివారం ఉదయం ఏడుగంటల సమయంలో వెళ్లారు. ఈ సందర్భంగా భరత్ వారితో మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నారని తెలిసి ఓదార్చి చేతనైనంత సాయం చేసేందుకు వచ్చానన్నారు. ఇటీవల భార్యబిడ్డలను కోల్పోయిన గంగులకు జీవనోపాధి కోసం ఉద్యోగం చూస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మీకు నచ్చిన వ్యక్తి.. మీకష్టాల్లో వెన్నంటి ఉండే వ్యక్తికి ఓటు వేయాలని సూచించారు. ఓటు అనే ఆయుధాన్ని ఉపయోగించడం మాత్రం మరువద్దన్నారు. ఆయన వెంట జీఎస్ నాయుడు,వాకాడ బాలు,ఆదారి సూర్యప్రారావు,ఇందుకూరి శ్రీనువాసరాజు,కిరణ్ తదితరులు ఉన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న శ్రీభరత్

విధుల్లో చేరిన కొద్ది గంటల్లోనే..



బొండపల్లి తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన రమణయ్య(ఫైల్)

- హత్యకు గురైన బొండపల్లి తహసీల్దార్ రమణయ్య ● విశాఖలో ఘటన

బొండపల్లి, ఫిబ్రవరి 3: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బదిలీపై వచ్చి బొండపల్లి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సనపల రమణయ్య (41) కొద్దిగంటల్లోనే హత్యకు గురయ్యారు. ఈ విషయం తెలిసి కార్యాలయ సిబ్బంది నిర్ఘాంతపోయారు. రెవెన్యూ యంత్రాంగమంతా చలించిపోయారు. తహసీల్దార్‌గా ఆయన శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విధుల్లో చేరారు. దాదాపు రెండు గంటల పాటు సిబ్బందితో మాట్లాడాక విజయనగరం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. 6.40 గంటలకు ఇంటికి బయలుదేరి విశాఖ జిల్లా కొమ్మాదిలోని తన అపార్ట్‌మెంట్‌కు చేరుకున్నారు. రాత్రి దాడికి గురయ్యారు. ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. రమణయ్య విశాఖపట్నం రూరల్ చినగదిలి తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో భూ వివాదాలు ఉన్నాయని, ఆ కారణంతోనే హత్యకు గురై ఉండవచ్చునని ఇక్కడి సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రమణయ్యకు భార్య అనూష, కుమార్తె సన్విసహస్ర, కుమారుడు కృష్ణరంగరేయాన్ ఉన్నారు. కాగా తహసీల్దార్‌గా శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బాధ్యతలు స్వీకరించిన రమణయ్య 2.30 గంటల వరకు కార్యాలయంలోనే ఉన్నారు. ఉప తహసీల్దార్ రౌతు శంకరరావుతో కార్యాలయ సిబ్బంది పనితీరు, ఎన్నికల ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సర్వేయర్ ఎచ్చెర్ల గౌరీశంకరరావుతో మాట్లాడి సర్వేప్రక్రియ ఎలా సాగుతోంది, ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై ప్రతీ ఒక్కరూ శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో ముఖాముఖి చేపట్టి సూచనలు అందజేశారు. ఆ తర్వాత ఇంటికి బయలుదేరారు.

- తహసీల్దార్ కార్యాలయంలో రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి సిబ్బంది నివాళులు అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, జడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, ఎంపీడీవో ఎస్.హరిహరరావు నివాళులు అర్పించారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

కలెక్టరేట్: బొండపల్లి తహసీల్దార్ రమణయ్య హత్యకు నిరసనకు రెవెన్యూ ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించారు. కలెక్టరేట్‌లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు మండల రెవెన్యూ కార్యాలయాల్లో పని చేసిన ఉద్యోగులు కూడా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తహసీల్దార్‌పై దాడిని ముక్తకంఠంతో ఖండించారు. కలెక్టరేట్ పోర్టికో వద్ద రమణయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా డీఆర్వో అనిత మాట్లాడుతూ తహసీల్దార్ హత్య దారుణమన్నారు. ఆయన కుటుంబానికి పూర్తిస్థాయిలో సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ హత్యకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరసనలో కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సుమబాల, రెవెన్యూ ఉద్యోగులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల నిరసన

దిమిలాడలో శోకసంద్రం

నందిగాం, ఫిబ్రవరి 3: తహసీల్దార్ సనపల రమణయ్య(41)హత్యతో ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దిమిలాడలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. రమణయ్య చిన్నప్పుడే తండ్రి రంగారావు మృతిచెందారు. తల్లి శకుంతలమ్మ, అక్క అమరావతి, సోదరుడు రోహిణీరావు ప్రోత్సాహంతో ఆయన చదువుకున్నారు. మారుమూల గ్రామం నుంచి గ్రూప్-2కు ఎంపికై ఉపతహసీల్దార్‌గా విధుల్లో చేరారు. తర్వాత తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. విశాఖ జిల్లా చిన్నగదిలి తహసీల్దార్‌గా పనిచేశారు. తాజాగా విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీ అయ్యారు. శుక్రవారం ఇక్కడ విధుల్లో చేరి రాత్రి ఇంటికి చేరుకున్న ఆయన హత్యకు గురవడంతో అంతా ఉలిక్కిపడ్డారు. ఆయన మృతదేహాన్ని శనివారం స్వగ్రామం దిమిలాడ తీసుకురాగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఏడేళ్ల కుమార్తె సహస్ర, మూడేళ్ల కుమారుడు కృష్ణరంగ రియాన్స్ బేలచూపులు అక్కడివారిని కలిచివేసింది. కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు గ్రామస్థులంతా రమణయ్యకు అశ్రునివాళి అర్పించారు. రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.





రమణయ్య భౌతిక దేహాన్ని చూసేందుకు వచ్చిన గ్రామస్థులు, (ఇన్‌సెట్‌లో) కుమార్తె సహస్ర వేలచూపులు

ఆ డ్రోన్ ఎటుపోయింది?

సర్వే కోసం వదిలాక అదృశ్యమైన వైనం


వంగర, ఫిబ్రవరి 3: బాగెమ్మపేట - పటువర్థనం గ్రామాల మధ్య భూముల సర్వేకోసం మూడురోజుల కిందట ఎగురేసిన డ్రోన్ కొద్దిసేపటికే దారి తప్పి అదృశ్యమైంది. సాధారణంగా పైకి వెళ్లిన డ్రోన్ కొన్ని చాయాచిత్రాలు తీశాక యథావిధిగా గమ్యాన్ని చేరుకోవాలి. ఇలా జరగలేదు. పైకి వెళ్లాక దారి మళ్లి ఎటో వెళ్లిపోయింది. అప్పటి నుంచి టెన్షన్ పడుతున్న సిబ్బంది డ్రోన్ వెతికే పనిలోనే ఉన్నారు. ఇప్పటికీ కనుక్కోలేకపోవడంతో శనివారం నాటికి విషయం బయటకు పొక్కింది. డ్రోన్ ఆచూకీ తెలిస్తే చెప్పాలని గ్రామాల్లో టాంటాం వేయించారు. బాగెమ్మపేట పరిధిలోని సూరమ్మకొండపై పడి ఉండొచ్చునని బావిస్తున్నారు. కొండపైకి శనివారం సాయంత్రం బయలుదేరారు.

ఎందువల్ల జరిగిందో?

డ్రోన్ సిగ్నల్, బాటరీని ఎప్పటికప్పుడు తప్పనిసరిగా పరిశీలించాలి. సిగ్నల్స్ 5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. వీరు డ్రోన్ ఉంటుందని చెబుతున్న సూరమ్మకొండ రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడే ఉంటే సిగ్నల్స్ అంది ఉండేవి. ఈ డ్రోన్ విలువ రూ.25 లక్షలు ఉంటుందని అంచనా. దొరకకపోతే ఉన్నతాధికారులు ఏమంటారోనని సిబ్బంది టెన్షన్ పడుతున్నారు.



డ్రోన్ చిత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది



డ్రోన్ ఈ కొండపైనే పడి ఉండొచ్చునని అంచనా

మేము ఉండనే ఉండం

- ముఖ్యనేతల ప్రసంగం మధ్యలో వెళ్లిపోయిన మహిళలు
- జడ్పీ చైర్మన్, విప్ మాట్లాడేటప్పుడు కుర్చీలు ఖాళీ

రేగిడి, ఫిబ్రవరి 3: రేగిడి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆసరా సమావేశం బోసిపోయింది. ప్రారంభం నుంచే అనేకమంది తిరుగుముఖం పట్టారు. కీలక నేతలు మాట్లాడుతుండగా ఎక్కువ మంది బయటకు వెళ్లిపోవడం కనిపించింది. ఒత్తిడి చేసి, బెదిరించి సమావేశానికి వాహనాలతో భారీగా జనాన్ని తీసుకొచ్చారు. వారిని చివరి వరకు ఉంచలేకపోయారు. నేతల ప్రసంగాలకు విసిగిపోయిన వారంతా ఉండలేం అంటూ బైబై చెప్పారు. కిందస్థాయి సిబ్బంది ఎంత నచ్చజెప్పినా ససేమిరా అని బయటకు వచ్చేశారు. కీలక నేతల ప్రసంగిస్తున్నప్పుడూ ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. జగన్‌పాలనపై నేతల ఊకదంపుడు ప్రసంగాలను మహిళలు వినలేకపోయారు. ఆసరా సమావేశంలో 1408 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.10.54 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశీను), ప్రభుత్వవిప్ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి తలే రాజేష్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

- సమావేశంలో మహిళలు సహనం కోల్పోయారు. ఇచ్చిన బిస్కెట్లు, టీలు కొంతమందికి అందకపోవటంతో తీవ్ర నిరాశ చెందారు.



జడ్పీ చైర్మన్ మాట్లాడుతున్నప్పుడు కుర్చీలు ఖాళీగా ఉన్న దృశ్యం

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

- తెలుగుదేశం పార్టీ నాయకుల ధ్వజం
- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరపత్రాల పంపిణీ


విజయనగరం రూరల్: అబాద్‌వీధిలో ర్యాలీ నిర్వహిస్తున్న అదితి గజపతిరాజు, టీడీపీ నాయకులు


వేపాడ: వావిలపాడులో ర్యాలీని ప్రారంభిస్తున్న గొంప కృష్ణ


జామి: తాండ్రంగిలో మాట్లాడుతున్న కేపే నాయుడు

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలమయ్యిందని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. శనివారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించి కరపత్రాలను అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు.

సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం: అదితి

విజయనగరం రూరల్: బీసీ, ముస్లిం, మైనార్టీల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు విమర్శించారు. విజయనగరంలోని 9, 29, 31 డివిజన్ల పరిధిలో రామకృష్ణ నగర్, ధర్మపురిరోడ్డు, నటరాజ్‌కాలనీ, సుంకరవీధి, గోశాల, కోట్లమాదప్పవీధి, ఆబాద్‌వీధి ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం బీసీ, ముస్లిం, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలకోసం ఏర్పాటు చేసిన పలు పథకాలను రద్దు చేసిందన్నారు. ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో 9, 29, 31 డివిజన్లకు చెందిన వడ్లమాని సుభద్ర, చిగురుపాటి రజనీ, వేగుంట హరిబాబు, షేక్ అక్తర్, షేక్ జాఫర్ హుస్సేన్, ఇమ్రాన్, కాకర్లపూడి విశ్వనాథరాజు, పప్పు విశ్వనాథ శాస్త్రి, పి బలరామ్, ఎం రమేష్ నాయుడు పాల్గొన్నారు.

● విజయనగరంలోని 41వార్డులో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సువ్వారి అనురాధ బేగం ఆధ్వర్యంలో జరిగింది. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి హరిబాబు, బంగారి హరినాథ్‌తో పాటు, నగర పార్టీ నాయకుడు మస్తాన్ వలీ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ఇచ్చిన ఆరు హామీలను ప్రజలకు వివరించారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: గొంప కృష్ణ..

వేపాడ: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ తెలిపారు. మండలంలోని వావిలపాడు, నల్లబిల్లి, చినగుడిపాల, నీలకంఠరాజపురం, కేఆర్‌పేట, కుమ్మపల్లి, మల్లంకి, బానాదిల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లబిల్లిలో మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో అభివృద్ధి,సంక్షేమం కుంటిపడిందన్నారు. టీడీపీ మండ లాధ్యక్షుడు గొంప వెంకటరావు, నాయకులు గుమ్మడి భారతి, బల్లంకి, బొద్దాం మాజీ సర్పంచ్‌లు గొర్లె నాగరాజు, జనపరెడ్డి ఈశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు గుర్తింపు: కేపే నాయుడు

జామి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే బీసీలకు గుర్తింపు ఇచ్చిందని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని తాండ్రంగిలో జయహోబీసీ సదస్సు నిర్వహించారు. వైసీపీ బీసీలను అణగదొక్కి వారి ఆగ్రహానికి గురైందని తెలిపారు. కార్యక్రమంలో పోలిపర్తి స్వామినాయుడు, కొత్తలి సూర్యారావు, పైడిరాజు,ముకుంద శ్రీను పాల్గొన్నారు.

గంజాయికి అడ్డాగా ఆంధ్రప్రదేశ్

● తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపణ

రాష్ట్రాన్ని గంజాయింధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలుగుదేశం పార్టీ నాయకుల ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయికి అడ్డాగా మార్చేశారని ధ్వజమెత్తారు. శనివారం వేర్వేరు చోట్ల టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా.. దాని మూలాలు ఆంధ్రలోనే ఉంటున్నాయని తెలిపారు.

యథేచ్ఛగా అక్రమరవాణా: అదితి

విజయనగరం రూరల్: గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఆరోపించారు. శనివారం విజయనగరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాలుగు ఏళ్ల తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా కేసులు విస్తృతమయ్యాయన్నారు. నిరుద్యోగులు, యువతకి సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల బానిసలుగా మారడంతో పాటు, గంజాయి అక్రమ రవాణా వైపు మళ్లుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు తీసుకురాలేకపోయిందని, ఉన్న పరిశ్రమలు తరలిపోయే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ధ్వజమెత్తారు. గంజాయి అక్రమ రవాణాతోపాటు, సేవించే వారి సంఖ్య కూడా పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయడు, కంది మురళీనాయుడు, గంటా రవి, జి.వెంకటరావు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు లేకే గంజాయికి బానిసలు : నాగార్జున

నాలుగున్నరేళ్లలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా, దానికి మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంటున్నాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యువత, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువయ్యాయని ఆరోపించారు. వైసీపీ పాలనలో రాష్ట్రానికి కొత్తగా ఒక పరిశ్రమ రాకపోగా, పాలకుల నిరంకుశ వైఖరి, విధానాలు వల్ల పలు పరిశ్రమలు రాష్ట్రం నుంచి తరలివెళ్లిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు లేకపోవడం వల్ల నైరాశ్యంలో కూరుకుపోయిన యువత గంజాయికి బానిస అవుతోందన్నారు. గంజాయి సేవించడం, విక్రయించడం వంటి కేసులు కుప్పలు, తెప్పలుగా నమోదు అవుతున్నా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు.

వ్యవస్థలన్నీ నిర్వీర్యం: లలితకుమారి

లక్కవరపుకోట: వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కాపలా కాయల్సిన కంచే చేను మేస్తోందని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. శనివారం ఎల్.కోటలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం పరువు జగన్ తీసేశాడని మండిపడ్డారు. శుక్రవారం రాష్ట్ర బెటాలియన్ పోలీసులు గంజాయితో తెలంగాణ పోలీసులకు దొరకడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. నిరంతరం నిఘా వేయల్సిన పోలీసులే దొంగతనాలు చేస్తే ప్రజలు ఏమనుకోవాలని ప్రశ్నించారు. పాలించేవాడు దొంగైతే అధికారులు అలాగే తయారవుతారని విమర్శించారు. వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో కోళ్ల శ్రీను, లాలాం అర్జునరావు, ఎం.శీలక్ష్మి, ఎం.శ్రీను పాల్గొన్నారు.



లక్కవరపుకోట: మాట్లాడుతున్న కోళ్ల లలితకుమారి

అనుమానాస్పదస్థితిలో ఒడిశా వాసి మృతి

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ సూర్యరెసిడెన్సీలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు చెందిన ఇందుభూషణ్ పాత్రో (65) అను మానాస్పదస్థితిలో మృతిచెందాడు.సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గ్రోత్‌సెంటర్‌లోని మిన్‌కార్ప్ రిసోర్స్ లిమిటెడ్ కంపెనీలో కన్సల్టెన్సీగా పనిచేస్తున్న ఇందుభూషణ్ పాత్రో ఈనెల ఒకటో తేదీ తెల్లవారుజామున లాడ్జిలో 204 నెంబరు రూమును బుక్‌చేసుకున్నాడు. గురువారం ఉదయం లాడ్జిలోని రూములోపలికి వెళ్లిన పాత్రో మూడురోజులైనా బయటకురాలేదు. లాడ్జి సిబ్బంది పలు దఫాలు తలుపు తట్టినా తీయలేదు. శనివారం ఉదయం రూము నుంచి దుర్గంధం వెలువడడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. వారి సమక్షంలో తలుపులను బలవంతంగా తెరిచి చూడగా మంచంపై బోర్లాపడి పాత్రో మృతదేహం పడిఉంది. అక్కడ లభ్యమైన ఫోన్‌నెంబరు ఆధారంగా ఒడిశాలోని కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీలోని మార్చురీకి తరలించారు. పాత్రో కుటుంబసభ్యులు ఇచ్చే ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తామని సీఐ నాగేశ్వరరావు తెలిపారు. పాత్రో మృతికి దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నామని చెప్పారు.

రేగలో యువకుడు ఆత్మహత్య


మధు (ఫైల్)

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామానికి చెందిన కొచ్చర్ల మోహన్‌సాయి (మధు) (24) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు.. రేగ గ్రామానికి చెందిన మోహన్‌సాయి ఒక యాక్సిడెంట్ కేసును షటిల్ చేద్దామని శుక్రవారం వెళ్లగా భార్యపద్మ మందలించింది. దీంతో మన స్థాపానికిగురై రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రిపూట వెతికినా దొరకలేదు. తెల్లవారు గ్రామానికి దగ్గరలో గల మామిడితోటలో ఉరివేసుకుని ఉన్నట్లు గుర్తించారు. తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

కొత్తవలస: మండలంలోని రామలింగపురంలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్టుచేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వీరి నుంచి 28 వేల 80 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అరెస్టు చేసిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశామని తెలిపారు.

మద్యం రవాణా చేస్తున్న ఒకరి..

విజయనగరం క్రైం: విజయనగరం రైల్వే పోలీసులు ఆధ్వర్యంలో రైలులో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టుచేసి 7,080 రూపాయల వ్యయం చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ రఘువర్మ తెలిపారు. రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా, బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తి ఒడిశాలోని రాయగడ నుంచి బొబ్బిలికి రవాణా చేస్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డారు.ఈ తనిఖీల్లో పీసీలు రవికుమార్, సురేష్, దిలీప్, సంతోష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అరకొరగా పరికరాలు

బొబ్బిలి: స్థానికఏఎంసీ కార్యాలయంఆవరణలో శనివారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోగల నాలుగు మండలాల దివ్యాంగులకు అరకొరగా పరికరాలను పంపిణీ చేశారు. నాలుగైదు నెలల కిందట బొబ్బిలిలో అర్హులైన దివ్యాంగుల ఎంపిక నిర్వహించిన సంగతితెలిసిందే. వారిలో కొంతమందికి విజయనగరంలో పలు పరికరాలను పంపిణీచేశారు. మిగిలిన వారికి శనివారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా అందజేసేందుకు ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లుచేశారు. 21.85 లక్షల రూపాయల విలువ చేసే హియరింగ్ మిషన్లు, లెప్రసీ బాధితులకు పరికరాలు, మెంటల్లీ ఇంపెయిర్డ్, మల్టిపుల్ ఇంపెయిర్డ్, ఆర్థోఇంపెయిర్డ్, విజువల్లీ పరికరాలను 263 మందికి అందజేశారు. బొబ్బిలి అర్బన్, రూరల్, బాడంగి , తెర్లాం, రామభద్రపురం మండలాల్లోని 197 మందికి పరికరాలను పంపిణీచేయాల్సి ఉండగా 131 మాత్రమే మంజూరు చేశారు. ఆర్థోపెడికల్లీ ఇంపెయిర్డ్ వంద పరికరాలు అవసరం కాగా 34 మందికి మాత్రమే, 18 వీల్‌చైర్స్, 10 ట్రైసైకిళ్లు, క్యాలిపర్స్ 2, గుటుంబర్స్-4 చొప్పున మంజూరు చేశారు. విజయనగరంలో పరికరాలు తయారవుతున్నందున మిగిలిన వారందరికీ మరోదఫా పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఎన్నికలకోడ్ త్వరలో విడుదలకానున్న నేపథ్యంలో వాటి పంపిణీ ఇక ప్రశ్నార్థకమేనని ఆశావహులైన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బీఎల్వోలతో ఈఆర్వో సమావేశం

శృంగవరపుకోట /జామి: జామి, శృంగవరపు కోట తహసీల్దార్ కార్యాలయాల్లో శనివారం ఈఆర్వో మురళీకృష్ణ బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్నికల అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసరావు,రాంబాయ్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహిస్తున్న మురళీకృష్ణ

మృతుల ఓట్లన్నీ తొలగిస్తాం: ఆర్డీవో


బొబ్బిలి: ఓటర్ల జాబితాల్లో మృతిచెందిన వారి పేర్లను కచ్చితంగా తొలగిస్తామని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. ఓటర్ల జాబితాల్లో ఇంకా మృతి చెందిన వారి పేర్లు, స్థానికేతరుల పేర్లు తదితర తప్పిదాలు చోటు చేసుకున్నట్లు ఆర్డీవో దృష్టికి తీసుకురాగా స్పందించారు.ప్రతి మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఎటువంటి సమస్యలు ఉన్నా పరిష్కరిస్తామని తెలిపారు.రానున్నఎన్నికల నిర్వహణకు అన్నివసతులతో కూడిన భవనాలకు అధికారులు అన్వేషణ ప్రారంభించారు. ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్,సిబ్బందికి విధులను అప్పగించే ప్రక్రియకు అనువుగా ఉండే కళాశాల లేదా పెద్ద విద్యాసంస్థ కోసం ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, డీటీలు రెడ్డి సాయి కృష్ణ, బలివాడ గౌరీశంకర్ శనివారం వివిధ విద్యాసంస్థలను పరిశీలించారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

తొలగించిన చోటే చెత్తసంపద కేంద్రం

వంగర: అరసాడలో చెత్తసంపద కేంద్రం తొలగించిన ప్రాంతంలోనే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రజ్యోతిలో ఇటీవల చెత్త సంపద కేంద్రం కొల్లగొట్టారు అన్న శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో డీపీవో స్థానిక పంచాయతీ అధికారి విజయ్ కుమార్, కార్యదర్శి వేణు నాయుడులకు మెమోలు జారీచేశారు. చెత్తసంపద కేంద్రం కొల్లగొడితే ఏమీ చేశారని, ఎందుకు చర్యలు తీసుకోలేదో వివరణ ఇవ్వకపోతే సస్పెండ్‌చేయడంతోపాటు చెత్త సంపద కేంద్రం నిర్మాణ వ్యయం రూ.14 లక్షలు రికవరీ చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.దీంతో అధికారులు తొలగించిన ప్రాంతంలో యధావిదిగా నిర్మాణాలు ప్రారంభించారు.


ప్రారంభమైన చెత్తసంపద కేంద్రం పనులు



అయితే చెత్తసంపద కేంద్రం నిర్మాణం ఉపాధి సిబ్బంది పర్యవేక్షణలో జరగాల్సి ఉంది. గాని ఇక్కడ వారికి తెలియకుండా గోప్యంగా కూలీలే ఇంజినీర్లుగా వ్యవహరించిపనులు జరుపుతున్నారు.ఈపనులు ఇలా జరపవచ్చా అని కార్యదర్శి వేణునాయుడు వివరణ కోరగా వారు గతంలో ఇచ్చిన కొలతలు ఉన్నాయని, వాటి ప్రకారం ఇక్కడ మూడు వేలు జనాభాకు సరేపడే పద్ధతిలో యదావిదిగా కడతామని చెప్పారు.గత కొలతలు పాటిస్తామని, అందుకేవారికి చెప్పలేదని తెలిపారు.

8న బాడంగిలో లోకేశ్ పర్యటన

● స్థల పరిశీలన చేసిన బేబీనాయన

రాజాం రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈనెల 8న సాలూరు, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొంటారు. రాత్రికి చీపురుపల్లి చేరుకుని అక్కడ బస చేస్తారు. 9న ఉదయం చీపురుపల్లి, నెల్లిమర్ల నియోజకవర్గాలలో సభల్లో పాల్గొంటారు. అదేరోజు రాత్రి విజయనగరం చేరుకుని 10న విజయనగరం, గజపతినగరం, శృంగవరపుకోట నియోజకవర్గాల్లో పర్యటిస్తారు. ఈనెల 8న బాడంగిలో జరిగే సభ ఏర్పాటుకు సంబంధించి బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబినాయన శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయాన్ని ఆయన శనివారం రాత్రి తెలిపారు. కాగా లోకేశ్ పర్యటనలో స్వల్ప మార్పులు జరిగే అవకాశాలు లేకపోలేదని పార్టీవర్గాలు చెబుతున్నాయి. అలాగే 7న ఉదయం పాలకొండ, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు


రాజాం మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రాజాం రూరల్: మునిసిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు కోరారు.ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్నిరాజాం మునిసిపల్ కమిషనర్ అప్పలనాయుడుకు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, గురువులు, లక్ష్మి, కనకరాజుతో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పీఎఫ్ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు.

బీమా సౌకర్యం కల్పించాలి

లక్కవరపుకోట: మధ్యాహ్నభోజనకార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘ నేతలు గాడి అప్పారావు ఆధ్వర్యంలో ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట తప్పారని వాపోయారు. వేతనాలు కూడా సరిగా ఇవ్వలేదని పేర్కొన్నారు. మెస్‌చార్జీలు రూ. 20 ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని, సెలవులు, ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు.కార్యక్రమంలో పైడితల్లి, లక్ష్మి, అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన పనులు చేయాలి: ఎంపీడీవో

రామభద్రపురం: ఉపాధిహామీ పథకంలో వేతనదారులు నాణ్యమైన పనులు చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ సూచించారు. రామభద్రపురంలో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జి.త్రినాథరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో ఆధిపత్య పోరు

● రాజీవ్ క్రీడా మైదానంలో ఘర్షణ వాతావరణం ● నేటికి పురుషుల కబడ్డీ పోటీలు వాయిదా ● పోలీసుల రంగ ప్రవేశం


రాజీవ్ క్రీడా మైదానంలో క్రీడాకారులతో చర్చిస్తున్న పోటీల నిర్వాహకులు

విజయనగరం రూరల్: విజయనగరంలో ఆడుదాం ఆంధ్రా పోటీలపై రాజకీయ ఆదిపత్య ప్రభావం పడింది. కబడ్డీ క్రీడకు సంబంధించి మూడు అసోసియేషన్లు ఉన్నాయి.ఇవి ఎప్పటికప్పుడు పోటీలు నిర్వహించి తమదే.. నిజమైన గుర్తింపు సంఘమని ఎవరికి వారు ప్రకటనలిస్తుంటారు. తాజాగా ఈ ఆదిపత్య పోరు ఆడుదాం ఆంధ్రా పోటీలపై పడింది. విజయనగరంలో రెండు కబడ్డీ అసోసియేషన్లకు పెద్దగా జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. ఓ సంఘానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అల్లుడు ప్రాతినిధ్యం వహిస్తుండగా, విజయనగరంలో ఎప్పుడూ కబడ్డీ పోటీలు నిర్వహించినా, వీరభద్రస్వామి, ఆయన అనుచరులు కూడా ఆదిపత్యం ప్రదర్శిస్తుంటారు.తాజాగా రాజీవ్ క్రీడామైదానంలో శనివారం ప్రారంభమైన ఈ పోటీల్లో ఆ ప్రభావం పడింది. ఎవరికి వారే.. తమదే ఆదిపత్యం అన్న రీతిలో వ్యవహరించారు. ఈవివాదం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి క్రీడాకారులు, క్రీడాసంఘాల ప్రతినిధులు తీసుకువెళ్లారు.ఆయన తనదైన శైలిలో ఇది ప్రభుత్వ కార్యక్రమం, విజయనగరం ఎమ్మెల్యేతో తాను మాట్లాడుతానని, మీరంతా ఆడుకొండని చెప్పి పంపేశారు. కాని శనివారం రాత్రి పురుషుల కబడ్డీ తప్ప, అన్ని పోటీలు ముగిశాయి. విజయనగరం జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఏడు జట్లు వచ్చాయి.తొలిమ్యాచ్ గజపతినగరం, చీపురుపల్లిమధ్య జరగాల్సిఉంది. ఆడుదాం ఆంధ్రా నిబంధనలు సరిగ్గా లేకపోవడంతోమ్యాచ్ ప్రారంభంలోనే వివాదం మొదలైంది. సచివాలయ స్థాయిలో రిజిస్ట్రేషన్ సరిగ్గా చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఈనేపథ్యంలో రాజీవ్‌క్రీడామైదానంలో క్రీడాకారులు మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది.కేకలు,అరుపులు, తోపులాటలతో క్రీడామైదానం దద్దరిల్లింది. రాత్రి తొమ్మిది గంటలకు పోలీసులరంగ ప్రవేశంచేశారు.సముదాయించి తాత్కాలికంగా పోటీలు నిలిపివేశారు. సెట్విజ్ సీఈవోతోపాటు పలువురు అధికారులు పరిస్థితిని సమీక్షించి, ఆదివారం మ్యాచ్‌లునిర్వహిస్తామని ప్రకటించి, క్రీడాకారులను పంపించివేశారు.

సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు అభినందన

బాడంగి: ముగడ గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ తెంటు గౌరీశ్వరికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం అభినందించారు. ప్రస్తుతం కేరళలో విధులు నిర్వహిస్తున్నగౌరీశ్వరి ఢిల్లీలో గణతంత్ర దినోత్సవంలో సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్ల తరపున నిర్వహించిన మార్చ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొబ్బిలి వాలీబాల్ జట్టు

బొబ్బిలి: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ వాలీబాల్ జట్టు ఆడుదాం ఆంధ్రాలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు సీనియర్ పీడీ, గ్రౌండ్ ఇన్‌చార్జి నల్ల వెంకటనాయుడు తెలిపారు.విజయనగరంలో జరిగిన పోటీలో ఎస్.కోట జట్టుపై బొబ్బిలి విజయం సాధించడంతో అర్హత సాధించినట్లు చెప్పారు. ఈనెల 9నుంచి విశాఖలో జరిగేరాష్ట్రస్థాయి పోటీల్లో బొబ్బిలి జట్టు పాల్గొంటుందని తెలిపారు. జట్టుకు కెప్టెన్‌గా బూరి భాస్కరరావు వ్యవహరించారు.

బస్‌షెల్టర్ ప్రారంభం

బొబ్బిలి: స్థానిక రాణీమల్లమ్మదేవి మున్సిపల్ పార్కు సమీపంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా బస్‌షెల్టర్‌ను నిర్మించారు. దీనిని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తీక్, నంబియార్ వేణుగోపాలరావు, శ్రీనివాసన్, శ్రీహరి, తమ్మిరెడ్డి దామోధరరావు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆర్థికంగా వెనుకబాటు వల్ల ప్రైవేటుసంస్థల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలకు శిక్షణ తీసుకోవడం కష్టమవుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేశాయని... ఈ నేపథ్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌తో పాటు, నైపుణ్యం గల అధ్యాపకులతో శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు చోడి ఆదినారాయణ, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కోళ్ల'కు పరామర్శ

లక్కవరపుకోట: విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులను పరామర్శించారు. మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు సతీమణి పైడితల్లమ్మ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు డెయిరీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు హాజరై తమ సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మహంతి చిన్నంనాయుడు, కె.రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, మల్లా రామకృష్ణ, కొట్యాడ రమణమూర్తి పాల్గొన్నారు.

తనిఖీ పారదర్శకంగా జరగాలి

వేపాడ: ఉపాధి పనులపై చేపట్టే సామాజిక తనిఖీ పారదర్శకంగా జరగాలని ఎస్ఆర్పీ ఎస్.అచ్చుతరావు కోరారు. శనివారం వేపాడలో ఈ పథకం క్షేత్ర స్థాయి, టెక్నికల్ సిబ్బంది,ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ మండలంలో వేతనాల రూపంలో రూ.12,46, 71,293 ,మెటీ రియల్ పనులకు గాను రూ.2 కోట్ల 6 లక్షల 16,500,మొత్తం 15 కోట్ల 52 లక్షల 85వేలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఖర్చుకు సంబంధించి పత్రాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ ఇంజినీర్ అలీ, ఏపీవో ఆదిలక్ష్మి, డీఆర్పీలు పాల్గొన్నారు.

శతశాతం ఫలితాల సాధనే లక్ష్యం: డిప్యూటీ డీఈవో

వేపాడ: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు కోరారు.శనివారం వేపాడ, నీలకంఠరాజపురం ఉన్నత, దబ్బిరాజుపేట, చామలాపల్లి ప్రాథమిక పాఠశాలలను, ఎమార్సీని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిసబెక్టుపై పట్టు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఆయన వెంట ఎంఈవో బాలభాస్కరరావు, హెచ్‌ఎంలు, సిబ్బంది ఉన్నారు.


వేపాడ పాఠశాలను పరిశీలిస్తున్న వాసుదేవరావు

నేడు కొండ డాబా వ్యాకులమాత జాతర

● నిర్వాహకుల ఏర్పాట్లు ● 260 మందితో బందోబస్తు

కొత్తవలస: కొండడాబా వ్యాకులమాత జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. కొత్తవలసకుమూడు కిలోమీటర్ల దూరంలోని కొండడాబాకు చెందిన కొండపై 1886లో ఫ్రాన్స్ నుంచి తీసుకొచ్చిన వ్యాకులమాత(కనికరమాత) విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా ఫిబ్రవరి మొదటి ఆదివారం కొండపై ఉన్న వ్యాకులమాత జాతరను నిర్వహిస్తున్నారు. కోరినకోర్కెలను తీర్చే కల్పవల్లిగా క్రైస్తవులు వ్యాకులమాతను నమ్ముతుంటారు. దీంతో మొక్కులు తీర్చుకోవడానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు చివరగా ఆదివారం తెల్లవారు జామునుంచే ప్రతిగంటకు ప్రత్యేకప్రార్థనలు నిర్వహిస్తారు. ఇలా 11 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించిన అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగాలను రెండు గంటల వరకు ఇస్తారు. ప్రసంగాల అనంతరం వ్యాకులమాత ఉత్సవం పూర్తయినట్లు ప్రకటిస్తారు. కొండడాబాలో నిర్వహించే వ్యాకులమాతకు విశాఖలోని జ్ఞానాపురంలో ఉన్న చర్చికి సంబంధముంది. జాతరకు ముందురోజు జ్ఞానాపురం నుంచి ఏసు తల్లిగా భావించే మరియమ్మ ప్రతిమను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పల్లకిలోపెట్టి పాదయాత్రగా కొండడాబాకు తీసుకొచ్చి ప్రార్థనలు చేస్తారు.ఇక్కడ దేశంలోనే అత్యంత ఎత్తయిన 120 అడుగులు ఏసుక్రీస్తు విగ్రహాన్ని ఏర్పాటుచేసిన విషయం విదితమే. కాగా ఆదివారంజరిగే జాతరకు సుమారు లక్ష మందికి పైబడి భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచనావేశారు. ఇందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లుచేశారు.విజయనగరం డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ పోలీసుస్టేషన్ల నుంచి ఎస్ఐలతో పాటు 260 మంది సిబ్బందిని శనివారం సాయంత్రానికే రప్పించారు. జాతరకు విశాఖ, విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జాతరకు వచ్చే వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్యలేకుండా ఒకమార్గంలో వచ్చే వాహనాలను అదే మార్గంలో తిరిగి వెళ్లకుండా ఏర్పాట్లుచేశారు.20 వేల వరకు వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు సంధ్యారాణి



పార్టీలో చేరిన వారికి ఆహ్వానిస్తున్న సంధ్యారాణి

మెంటాడ: తెలుగుదేశం హయాంలోనే బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మెంటాడలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలు అణచివేతకు గురయ్యారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీసీలతో పాటు అన్ని వర్గాలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వైసీపీకి అభ్యర్థులు కరువై ఆపసోపాలు పడుతూ ఎమ్మెల్యేలు, ఎంపీలను బదిలీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు చలుమూరి వెంకటరావు, జి.అన్నవరం, రెడ్డి ఆదినారాయణ, ఎర్నాయుడు, రవిశంకర్, సత్యనారాయణ, రామచంద్రుడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

400 మంది చేరిక

మెంటాడలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున టీడీపీలో చేరారు. వీరిలో గుర్ల మాజీ సర్పంచ్ గొర్లి ఈశ్వరమ్మ, ఆమె భర్త మాజీ ఉపసర్పంచ్ జి.సన్యాసిరావు, పిట్టాడ మాజీ సర్పంచ్ బంటుపల్లి సన్యాసి, మాజీ ఉపసర్పంచ్ కాపారపు అప్పలసూర్య నారాయణ, పెదమేడపల్లి మాజీ ఎంపీటీసీ డి.నూకంనాయుడు, వాణిజ వార్డు మెంబరు సన్యాసి దొర, జయతి మాజీ వార్డు మెంబరు బెల్లాన రామచంద్రరావు, ఉయ్యాడవలస గ్రామస్థులతో పాటు సుమారు 400 మంది వైసీపీని వీడి టీడీపీలో కలిశారు. ఈ కార్యక్రమంలో చలుమూరి వెంకటరావు, అన్నవరం, ఆదినారాయణ, సరకాన రామునాయుడు, గొర్లె గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వసంతలో భవిష్యత్తుకు గ్యారెంటీ

గంట్యాడ: వసంత గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత ఎమ్మెల్యే నియోజకవర్గంపై దృష్టి సారించడం లేదని, దీంతో అభివృద్ధి కుంటు పడిందన్నారు. గ్రామంలో తాగునీటి కొళాయి ఏర్పాటు చేయలేకపోయారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ నాయకులు అల్లు విజయకుమార్, రంధి చిన రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గోతిలోకి ఒరిగిఉన్న వ్యాను

దత్తిరాజేరు: పెదమానాపురం రైల్వేగేటు వద్ద కల్వర్టు సమీపంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రామభద్రపురం నుంచి విజయనగరం వైపు వెళుతున్న బొలేరో వ్యాను మానాపురం రైల్వే గేటు వద్ద ఆగింది. తిరిగి వెనక్కి వెళ్లేందుకు డ్రైవర్ వ్యానును వెనక్కి నడుపుతుండగా అదుపు తప్పి, ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం తీసిన గోతిలోకి వెళ్లబోయింది. వెంటనే డ్రైవర్ బ్రేకులు వేయడంతో అపాయం తప్పింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అసంపూర్తిగా కాలువ నిర్మాణం

● పేరుకుపోతున్న మురుగు



రైల్వే కాలనీలో అసంపూర్తిగా డ్రైనేజీ పనులు చేపట్టిన దృశ్యం

గజపతినగరం: పురిటిపెంట రైల్వే కాలనీలో లక్షల వ్యయంతో డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టి, అసంపూర్తిగా వదిలివేయడంతో మురుగునీరు ఎక్కడికక్కడే పేరుకుపోతుంది. దీంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు స్వైర విహారం చేస్తున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

● రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీసీ రవీంద్రనాథ్

విజయనగరం క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులతో పాటు ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రవాణా శాఖ ఉప కమిషనర్ రవీంద్రనాథ్ అన్నారు. శనివారం విజయనగరలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, కలెక్టరేట్ మీదుగా రవాణా శాఖ కార్యాలయం వరకూ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉప కమిషనర్ రవీంద్రనాథ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాల వల్ల రోడ్డు ప్రమాదాలను 10 శాతమైనా తగ్గించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రంగనాథ్, ఆర్‌టీఓ రమేష్, ఎంవీఐలు ఏవీ రమణ, యు.దుర్గాప్రసాద్, రవిశంకర్ ప్రసాద్, ఏఎంవీఐలు ఐశ్వర్య లక్ష్మి, శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పౌర సేవలను అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న తిరుమలరావు

విజయనగరం రింగు రోడ్డు: సచివాలయ సిబ్బంది మెరుగైన పౌర సేవలు అందించాలని నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు సూచించారు. శనివారం విజయనగరం కార్పొరేషన్‌లోని 40వ నెంబరు సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ప్రజలకు సులభతరమైన సేవలు అందించాలన్నారు. కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో సింహాచలం పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



జల్లు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కళా వెంకటరావు

రేగిడి: రేగిడి, ఆమదాలవలసల్లో టీడీపీ కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఇటీవల మృతి చెందటంతో మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు, ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావులు శనివారం పరామర్శించారు. ఆమదాలవలసలో మాజీ సర్పంచ్ వై.హేమసుందరావుకు మాతృవియోగం కలగడంతో ఆ కుటుంబాన్ని, రేగిడిలో మాజీ డీలరు జల్లు సంగంనాయుడు మృతి చెందటంతో వారి కుటుంబీకులను కలిసి సంతాపం తెలిపారు. వీరి వెంట రేగిడి మండల టీడీపీ అధ్యక్షుడు కిమిడి అశోక్‌కుమార్, రవిబాబు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

● బొండపల్లి తహసీల్దార్ హత్యకు జిల్లా వ్యాప్తంగా నిరసన

● నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన రెవెన్యూ సిబ్బంది

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తహసీల్దార్ ఎస్.రమణయ్య హత్యను ఖండిస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది శనివారం నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. రమణయ్య మృతికి సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న తహసీల్దార్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



దత్తిరాజేరు: నివాళులు అర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



సీతంపేట: నిరసన తెలియజేస్తున్న వీఆర్వోలు



బొబ్బిలి: నివాళులర్పిస్తున్న బొబ్బిలి రెవెన్యూ అధికారులు



బొండపల్లి: నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు



రామభద్రపురం: నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది



శృంగవరపుకోట: తహసీల్దార్ కార్యాలయం వద్ద..



కొత్తవలసలో..

వైసీపీ పాలనలో ఉద్యోగులకు భద్రత కరువు

బొండపల్లి: విధుల్లో బాధ్యతగా పనిచేసిన ఉద్యోగులకు వైసీపీ పాలనలో భద్రత లేకుండా పోవడం విచారకరమని టీడీపీ మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.రమణయ్య ను హత్య చేయడం వైసీపీ పాలనకు నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి.బాలాజీ, పచ్చిమట్ల కృష్ణమూర్తిరాజు, రాపాక అచ్చింనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతి చెందిన వారి ఓట్లు ఎందుకు ఉంచారో?

భోగాపురం: మండలంలో అక్కడక్కడ మృతిచెందినవారి పేర్లు ఓటరు రికార్డుల్లో ఉండడంతో అవి ఎందుకు ఉంచారోనని స్థానికులు, కొన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు అనుకుంటున్నారు. రకరకాలుగా వడపోతలు చేసి ఇటీవల ఓటరు జాబితా ప్రచురించారు. అయినా జాబితాలో అక్కడక్కడ మృతిచెందిన వారి పేర్లు దర్శనమిస్తున్నాయి. భోగాపురం పంచాయతీ అప్పన్నపేట గ్రామం 230 నెంబరు పోలింగ్ బూత్‌లో ఆరు ఓట్లు మృతి చెందిన వారివి ఉన్నాయి. భోగాపురం గ్రామంలో 224 పోలింగ్ బూత్ పరిధిలో సీరియల్ నెంబరు 695-వరహాలమ్మ కానూరు, 696-సావిత్రి సుగంధం, 302-రామయ్యమ్మ శీల, 767 గోపిబొల్లు, 336-లక్ష్మిశీల, 609-లక్ష్మణుడుశీల,



ఓటరు జాబితాలో మృతిచెందిన ఓటర్ల పేర్లు

612-అప్పలనర్సయ్యశీల, 712-సావిత్రి అక్కిరెడ్డి, 858-అప్పడుతాత కొమ్మూరు మృతి చెందినా ఓటరు రికార్డుల్లో పేర్లు కొనసాగుతున్నాయి. దీనిపై ఉపతహసీల్దార్ శ్రీనివాసరావును వివరణ కోరగా సరైన సమాచారం లేకనే అక్కడక్కడ మృతి చెందిన ఓటర్ల పేర్లు ఉండి ఉంటాయని అన్నారు. మళ్లీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి మృతి చెందిన ఓటర్ల పేర్లు తొలగిస్తామని తెలిపారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈవో

గజపతినగరం: పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండంతో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. మరుపల్లి గ్రామంలో ఆదర్శ పాఠశాలలో పరీక్షా కేంద్రాలకు కేటాయించిన గదులను ఎంఈవో చక్రధర్ శనివారం పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఓడ్ పాఠశాలలో 240మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై అవగాహన

నెల్లిమర్ల: నెల్లిమర్ల అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సమన్వయ కర్త టి.పద్మజ, ఆర్‌డీ వి.చంద్రశేఖర్, రిటైర్డ్ డీపీవో కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.ఉషారాణి, పూర్వ విద్యార్థులు, మోటివేటర్ జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

గరివిడి: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందజేశామని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నిర్వహించిన నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళలకు ఆసరా నిధుల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ధీర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొత్స సందీప్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

భోగాపురం: అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. భోగాపురం పంచాయతీ చెరువుకొమ్ము గొల్లపేట సమీపంలో గతంలో ఇంటి పట్టాలు పొందిన వారికి శనివారం 163 మందికి స్థలాలను అప్పగించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల ప్రారంభం

గంట్యాడ: లక్కిడాం, బోనంగి గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, జడ్పీటీసీ సభ్యుడు వర్రి నర్సింహమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేమలి ముత్యాలు నాయుడు, ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్‌కుమార్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వం

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను దగా చేస్తోందని జనసేన నాయకుడు గురాన అయ్యలు విమర్శించారు. శనివారం విజయనగరంలో విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల సమయం వచ్చేసరికి ప్రభుత్వానికి నిరుద్యోగులు గుర్తొచ్చారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో 21 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే 6,100తో మమ అనిపిస్తున్నారని.. ఇది నిరుద్యోగులు, ప్రజలను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడి మృతి

నెల్లిమర్ల: సీతారామునిపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు, రిటైర్డ్ టీచర్ కళ్యాణం లక్ష్మునాయుడు మృతి చెందారు. లక్ష్మునాయుడు (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ తరువాత 2006 నుంచి 2010 వరకు సీతారామునిపేట ఎంపీటీసీ సభ్యుడిగా సేవలు అందించారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి.. సానుభూతి తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధితో దేశాభివృద్ధి

మక్కువ: మహిళల ఆర్థిక అభివృద్ధే దేశాభివృద్ధి అని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలో ఆయన శనివారం ఆసరా చెక్కులను పం పిణీ చేశారు. అనంతరం స్థానిక 1, 2 సచివాలయాలను, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. వీటిని ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఎంపీపీ పారమ్మ, సర్పంచ్ రామలక్ష్మి, ఎంపీడీవో పి.దేవకుమార్, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి

● టీడీపీ నాయకుల పిలుపు

కురుపాం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 7న జరిగే టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం కురుపాం ఏజెన్సీలోని 14 గ్రామ పంచాయతీలకు చెందిన టీడీపీ శ్రేణులు పెదగొత్తిలి గ్రామంలో సమావేశమయ్యారు. అధిక సంఖ్యలో కార్యకర్తలను కార్యక్రమానికి తరలించాలని తీర్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీలను ప్రజలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జడ్పీ మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో జగన్నాథంనాయుడు

పాచిపెంట: పి.కోనవలస ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్ విద్యార్థులకు శనివారం నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నీడ్ సంస్థ సిబ్బంది బి.కనక రత్నం మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురికా కుండా ఉండాలని సూచిం చారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఎం.పవర్ ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ సౌజన్యంతో అవగాహన కల్పించామని నీడ్ స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జేఎస్‌కే రాజు, నీడ్ సిబ్బంది, పీసీ కె.మోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ముఖ్యమని ఎంఈవో జగన్నాథంనాయుడు అన్నారు. ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్టు, నీడ్ సంస్థ సహకారంతో యస్ సొసైటీ ఆధ్వర్యంలో టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు మానసిక ఆరోగ్యంపై శనివారం అవగాహన కల్పించారు. ఎంఈవో మాట్లాడుతూ పిల్లలు ఒత్తిడిని అధిగమించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం షేక్‌గౌస్ మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొర శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.